# 9. కొత్త దృశ్యం

చాలాసేపు ఊపిరి కూడతీసుకుంటూ కూర్చున్నాడు డీన్ రామరాజు. ఆయనకి మనసంతా వికలమై ఉంది.

ఆయన ముందున్న టేబుల్‌మీద ఆరోజు దినపత్రికలన్నీ చెల్లాచెదరుగా పడి ఉన్నాయి. వాటిల్లో వచ్చిన వార్తలూ, వ్యాఖ్యలూ, కథలూ, కథనాలూ- అన్నీ జరిగిన దుర్ఘటనకి తననే వేలెత్తి చూపుతున్నాయి.

గడచిన పది రోజులుగా పత్రికలన్నీ ఈ 'దారుణం' గురించిన సీరియల్ కథనాల్ని ప్రచురిస్తున్నాయి. కాలేజీ పరిస్థితులకి తాను అవలంబిస్తున్న 'దుర్మార్గపు' విధానాలే కారణమని ఘోషిస్తున్నారు-విద్యార్థులూ, తల్లిదండ్రులూ!

❖ ❖ ❖

పాండవస్వామి ఇంజనీరింగ్ కాలేజీ, డీమ్డ్ యూనివర్శిటీ. చాలా ప్రసిద్ధిచెందిన విద్యా సంస్థ. అది 'కో ఎడ్యుకేషన్' కాలేజి.

ఉన్నట్టుండి వార్తల్లో కెక్కింది. హాస్టల్లో మూడో సంవత్సరం కంప్యూటర్ సైన్స్ విద్యార్థి ఒకడు ఉరేసుకుని ఆత్మహత్యచేసుకున్నాడు.

హాస్టల్ మూసేశారు. విద్యార్థులు ఆందోళనలూ, హర్తాళ్‌లూ చేశారు. పోలీసుల లాఠీలకూ పని తగిలింది.

మరో వారం గడిచింది. పరిస్థితి క్రమంగా చల్లబడింది.

మరో వారం తర్వాత ప్రతి విద్యార్థినీ పేరెంట్‌తో గానీ గార్డియన్‌తో గానీ కాలేజ్‌కి 'కౌన్సిలింగ్'కి రమ్మని పిలిచారు.

కౌన్సిలింగ్ మొదలైంది. ఇవ్వాళ నాలుగోరోజు. నగరంలోని వారే కాక, ఇతర ప్రదేశాలవారు కూడా పెద్ద సంఖ్యలోనే వచ్చారు.

ప్రతి విద్యార్థినుంచీ,పేరెంట్ నుంచీ - జరిగిన దుర్ఘటనలో కాలేజీ యాజమాన్యం తప్పేమీ లేదనీ, తాము ఎలాంటి అలజడుల్లోనూ, ఆందోళనల్లోనూ పాల్గొనబోమనీ - ఒక ధృవీకరణపత్రం తీసుకుని పంపుతున్నారు.

ఈ మధ్యాహ్నం ప్రచండంగా వుంది. కాలేజీ ప్రాంగణమంతా విద్యార్థినీ విద్యార్థులతో, పేరెంట్స్, గార్డియన్స్‌తో నిండిపోయింది. వివరంలేని సంభాషణలూ, రాజకీయాలూ, ఆవేశ ప్రకటనలూ, నిర్వేద నిస్సహాయతల వ్యక్తీకరణా - సాగిపోతున్నాయి.

లోపల్నుంచి ఒక తండ్రి బయటపడ్డాడు. పక్కన ఆయన కుమార్తె. "వీళ్లంతా గొప్ప హిపోక్రెట్స్ సార్. అన్నీ నాటకాలు. వేలకి వేలు ఫీజు గుంజటం. నిర్లక్ష్యం. పైగా మనదే తప్పన్నట్టు ఈ డిక్లరేషన్స్!" ఎవరికి చెబుతున్నాడో తెలీకుండా ఆవేశపడి వెళ్ళిపోయాడు.

ఆ తర్వాత - సర్వమూ కోల్పోయిన రాజరాజు మొహంతో ఒక పెద్ద మనిషి వచ్చాడు. "వెధవ కాలేజీ, వెధవ చదువూ, మావాడు ఎంత బాగా రాసినా, 'సి'- ప్లస్ గ్రేడ్ దాటనీయటం లేదు. అంతా కుట్ర. కులం గబ్బు" అని విసవిసా వెళ్ళిపోయాడు.

ఎనభై ఎనభై అయిదేళ్ళ వృద్ధుడు, పక్కన పిల్లతో లోపలికి వెళుతున్నాడు. దవడలు పీక్కుపోయి, కళ్ళు గుంటలు పడి, వాయిద్య ఘటం లాంటి బట్టతలతో ముసలితనం 'బ్రేవ్'మంటున్నా చాలా 'బ్రేవ్'గా నడుస్తున్నాడు.

రూమ్‌లోకి ప్రవేశించాడు. "ఐయామ్ - సుబ్బు. ఈ పిల్ల మాలతి. థర్డ్ సిఎస్‌సి. నేను ఈమెకి లోకల్ గార్డియన్‌ని." అని కుర్చీని సర్దుకుని, చప్పుడు చేస్తూ కూర్చున్నాడు. మాలతీ కూర్చుంది.

ఎదురుగా డీన్ రామరాజు, బోర్డ్ మెంబర్ - రత్నం, ప్రిన్సిపల్ - అబ్రహామ్, ఎడ్మిన్ చీఫ్- మేఘన, కౌన్సిలర్ - చంద్ర! మొహామొహాలు చేసుకున్నారు.

మాలతి 'డేటా షీట్'ని ముగ్గురికీ ఇచ్చింది మేఘన. చూశారు. రామరాజు వైపు ఒకసారి సాలోచనగా చూసి- అబ్రహామ్ "జరిగిన సంగతులన్నీ మీకు తెలుసు" అంటూ ఉపోద్ఘాతాన్ని ప్రారంభించాడు.

సుబ్బు మొహం మీద కోపపు మబ్బులు దట్టంగా కమ్మేయి. తృటిలో అవన్నీ ఏనుగు గుంపుల్లా కూడగట్టుకుని మాటల జడివానని కురిపించసాగాయి.

'తెలిసింది సంగతులు కాదు. కఠిన వాస్తవాలు. అన్నీ దుర్మార్గాలూ, దారుణాలూ! మీ కాలేజీలకి పాపం ఆ పెద్దాయన ఆధ్యాత్మిక గురువుగారి పేరు పెట్టుకుని ఆయనకీ మచ్చ తెస్తున్నారు. 'అటానమస్' అనగానే కొమ్ములొస్తయ్. మీకు మీరే రాజులనుకుంటారు. విద్యార్థులు పరీక్ష తప్పరా? తప్పితే ఫీజు

దండుకుంటున్నారు గదా? ఏమొచ్చింది మీకసలు? సెమిస్టర్ సెమిస్టర్‌కీ పరీక్షల నిబంధనలు మారుస్తారా? అంతా మీ యిష్టమేనా? ముందుగా చెప్పేది లేదా? ఏం మేనేజ్‌మెంటండీ. వరుసగా కూర్చోటానికీ, జీడిపప్పు పకోడీలు తినటానికీనా? పూర్‌ఫెలో. ఆ కుర్రాడు-సింహాద్రిని- ఆత్మహత్య చేసుకొనేట్టు చేశారు. పరీక్ష తప్పిన వాణ్ణి మీ మాటలతో కుళ్ళబొడిచారు. వాడేమన్నా దేశద్రోహా? 'రియల్లీ - యూ ఆర్ శాడిస్ట్స్!"

ఎదుటివారంతా ఆ వడగళ్ళని ఏరు కోలేక పోతున్నారు. రామరాజైతే ఆ 'ముసలి' రాళ్ళదెబ్బలకి నివ్వెఱ పోతున్నాడు.

సుబ్బు కళ్లజోడు చేతిలోకి తీసుకుని, కర్చీఫ్‌తో తుడుచుకుని, మళ్ళీ ధరించాడు. వాళ్ళందరి వైపూ చూశాడు.

వాళ్లూ నిదానంగా తెప్పిరిల్లారు.

మేఘన వైపు చూశాడు రామరాజు. ఆమె నీళ్ళ గ్లాసుని సుబ్బు ముందుకు జరిపింది. ఆయన దాన్ని పక్కకి పెట్టాడు. మాలతి తీసుకుని గటగటా తాగింది.

"సారీ, సుబ్బుగారూ! జరిగిన సంభవానికి మీలాంటి పెద్దలకి క్షమాపణలు చెప్పుకోవాలనే ఈ మీటింగ్స్ ఏర్పాటు చేశాము" సన్నాయి నొక్కులు నొక్కాడు రత్నం.

ఈ మాట సుబ్బునేం ఉపశమింపచేయలేదు. పైగా ఆయన కోపాన్ని మరింత రెట్టించింది. "యూస్‌లెస్ పోస్ట్‌మార్టమ్. మీ బోడి క్షమాపణ లెవడిక్కావాలి. ఇవన్నీ చనిపోయిన సింహాద్రి ప్రాణాల్ని తెచ్చిస్తాయా?'

"ప్లీజ్ కూల్‌డౌన్ సర్. కూల్‌డౌన్" అన్నాడు రత్నం. కొద్దిక్షణాలు మౌనం వహించాడు సుబ్బు. అప్పుడు మళ్లీ తన మాటల్ని కొనసాగించాడు.

"మొన్న మీ స్టూడెంట్స్ చేసిన ఆందోళన ఎంతో అర్థవంతమైంది. వాళ్ల డిమాండ్స్‌ని పేరెంట్స్, గార్డియన్స్ అంతా సపోర్ట్ చేస్తున్నారు. పోర్షన్‌లో కవర్‌కాని ప్రశ్నల్ని పరీక్షలో ఎట్లా ఇస్తారు? అలాగే పేపర్ మోడల్ మార్చదలచు కుంటే ముందుగా తెలియజేయక్కర్లేదా?"

"యా...యా... మీ సలహా ఎంతో విలువైనది. తప్పకుండా పాటిస్తాం. కానీ, మా లిమిటేషన్స్ మాకుంటాయి గదా" అని సాత్వికంగానే అన్నాడు రామరాజు.

సుబ్బు తలెత్తి కళ్ళజోడు ఫ్రేమ్‌లోనుంచీ రామరాజు నేమ్‌ప్లేట్ చూశాడు. "ఓహ్! మీరేనా డీన్ -రామరాజు? వీటన్నిటికీ మీరేకదా మూలం. మీరు చాలా

'స్ట్రిక్ట్'ట కదూ?" అని తలపక్కకి వంచి "ఇంట్లో పెళ్లాం పిల్లల్ని అదుపుచేసుకోని వాళ్ళంతా బయట స్ట్రిక్ట్ అని ఒక వాస్తవోక్తి వుంది. దీన్నే 'మాడిఫైడ్ బిహేవియర్' అంటారు" అన్నాడు.

రామరాజు ఈ మాటతో కలవరపడ్డాడు. నిలువునా చీరేసినట్లయింది. 'దీసీజ్ టూమచ్. హోల్డ్ యువర్ టంగ్" అన్నాడు పెద్దగా.

ఠక్కున లేచి నిలబడ్డాడు సుబ్బు. "ఏమంటున్నావ్ నువ్? జాగ్రత్త! ఎవరనుకుంటున్నావ్ నన్ను?" అని పిడికిలి బిగించాడు. మాలతి ఆయన చేతిని పట్టుకుని, దీనంగా తలెత్తి ఆయన కళ్లల్లోకి చూస్తూ "ప్లీజ్– తాతయ్యా!" అన్నది కూర్చోమన్నట్టు.

కూర్చున్నాడు సుబ్బు. శాంతస్వరంతో– "మీరందరూ ఆత్మహత్య చేసుకున్న సింహాద్రి వివరాల్నేమైనా తెలుసుకున్నారా? ఆతని తల్లి కూరగాయల్ని అమ్ముకుంటుంది. ఇతరుల వితరణతో–ఉన్న ఒక్క కొడుకునీ చదువులో ఇంతదూరం లాక్కొచ్చిన భర్త విహీన ఆమె. ఆమెని పలకరించటానికిగానీ, అనునయించటానికి గానీ మీలో ఒక్కరైనా ప్రయత్నించారా? ఆమె కడుపు శోకాన్ని అర్థంచేసుకున్నారా?"

అందరూ అపరాధభావంతో తలలు వంచుకున్నారు. రామరాజు గుండెలో ఆక్రోశం కుతకుతలాడుతోంది.

"అసలు– మీకు నేనొక సూచన చెయ్యాలి. అందుకోసమే వచ్చాను" అని చెప్పసాగాడు మళ్ళీ. "ఇంటర్‌నుంచీ ఇంజనీరింగ్‌లో ప్రవేశించే పిల్లలకి – ఆ ట్రాన్సిషన్‌లో మీరందించే ధైర్యస్థైర్యాలేమిటి? అనేకరకాలైన ఒత్తిడుల్ని తట్టుకునేందుకు మీరుగా వారికి చెప్పే జాగ్రత్తలేమిటి? అవసరమైన 'ఎమోషనల్ సపోర్ట్'ని ఏనాడన్నా మీ లెక్చరర్స్ వారికి అందించారా? మీ చదువులూ, నిబంధనలూ, హేళనలూ ఇతర సహాధ్యాయుల ఆకతాయి చేష్టలూ... వీటిని అధిగమించి నిలవటానికీ, మానసికంగా వారికి తగిన ఊతం ఇవ్వటానికీ, వారి అభివృద్ధిని 'మానిటర్' చేయటానికీ– మీకేమైనా ప్రణాళిక అంటూ వుందా? లేదు. కేవలం నామమాత్రపు గాలిలో వ్యక్తులుంటారు. వారిపేరు –కోఆర్డినేటర్లు. లేకుంటే కౌన్సిలర్లు! జీవితం పట్ల ఆశాభావం, సదవగాహన, సానుకూల దృక్పథం – పెంపొందింపజేయడానికి మీ సిలబస్‌లో కొన్ని పాఠ్యాంశాల్ని పొందుపరచండి. ప్లీజ్– మన పిల్లల ఆత్మహత్యల్ని నివారించండి"

అందరూ మొహమొహాలు చూసుకున్నారు.

తమ విద్యావిధానంలో వున్న కీలకమైన లోపాన్ని సుబ్బు – ముక్కుమీద కొట్టి మరీ చెప్పాడనిపించింది.

"గుడ్" అన్నాడు రత్నం రామరాజు వైపు చూస్తూ. ఆయన శూన్యదృక్కుతో తల విదుల్చుకున్నాడు. నిజానికి సుబ్బు అన్నమాటలూ, తిట్టిన తిట్లూ, చేసిన సూచనలూ... అన్నీ కలిపి ఆయన మనసుని ఉక్రోషంతో మండిస్తున్నాయి. కలగాపులగంగా బుర్రలో రొద చేస్తున్నాయి. చిక్కుపడిన దారపు వుండలావున్నై – ఆయన 'లోపలి' ఆలోచనలు.

సరిగ్గా ఇప్పుడు –

మేఘన డిక్లరేషన్‌ని నిదానంగా సుబ్బు ముందుకు జరిపింది.

దాన్ని చూడకుండానే అన్నాడు సుబ్బు. "నేనుగానీ, నామనవరాలు గానీ ఈ పత్రాన్ని సంతకం చేయము. ఇక్కడ అన్యాయం జరుగుతుంటే, నలుగురితోపాటు ఆమె కూడా నిరసన తెలుపుతుంది. అది ఆమె హక్కు. ఇదేమీ రాజకీయం కాదు. ఆ హక్కుని హరించివేసే ఇలాంటి డిక్లరేషన్స్ చట్టపరంగా చెల్లవు. అయినా భవిష్యత్తులో మీరు చేయబోయే తప్పులకి ఇవాళే మా ఆమోదముద్ర తీసుకోవటం ఫూలిష్‌నెస్ కదూ? అంతా బంకమ్" అని ఆ కాగితాన్ని పక్కకి నెట్టాడు. పక్కచూపుతో రామరాజుపైకి ఒక ఈసడింపునీ సంధించాడు.

"విద్యాసంస్థ అన్న తర్వాత కొంత క్రమశిక్షణ వుండాలి కదా. అందుకని... " అని నసిగాడు రామరాజు.

"క్ర...మ...శి...క్ష...ణ"! అదే లేదిక్కడ. మిస్టర్ రామరాజూ, మీ పాత్రని మీరు సరిగా నిర్వర్తించండి. రేపటి యువత భవిత కోసం దాన్ని ఉన్నతంగా నిర్వహించండి. అదే నా సలహా" అని స్పష్టంగా, స్ఫుటంగా అన్నాడు సుబ్బు.

"పాఠాలు బాగానే చెబుతున్నారు మీరు!" రామరాజు అన్నాడు వ్యంగ్యంగా.

మళ్లీ ఒక్కసారిగా చిటపటలాడాడు సుబ్బు. లేచి నిలబడ్డాడు. "మిస్టర్ రామరాజూ. మీరు ఆరేళ్ళ డీన్. నేను ఫారిన్ యూనివర్శిటీస్‌లో ఇరవై ఎనిమిదేళ్ళ డీన్‌ని. పాఠం చెప్పే అనుభవంలో నాదే పై చెయ్యి" అని విసురుగా బయటకి వెళ్ళిపోయాడు. మౌనంగా ఆయన్ని అనుసరించింది మాలతి.

రామరాజు ఇంక అక్కడ కూర్చోలేకపోయాడు రత్నంకి చెప్పి, వచ్చి తన ఛాంబర్‌లో పడ్డాడు.

ఆయన తట్టుకోలేకపోతున్నాడు. ఎంత మాట అన్నాడీ సుబ్బు?! 'ఇంట్లో పెళ్ళాం పిల్లల్ని అదుపు చేసుకోని వాళ్లంతా బయట 'స్ట్రిక్ట్' అని కదూ? ఒళ్ళంతా కారం రాచినట్లయింది. 'మాటలతో చితక్కొట్టేశావు రా – సుబ్బు' అనిపించి ఏడుపొచ్చింది. తన 'ఇన్నర్‌సెల్ఫ్'ని చీల్చి చేతికిచ్చాడే అనే బాధ తినేస్తున్నది.

అయినా – సుబ్బూకెట్టా తెలుసో? మాణిక్యాంబ-మిసెస్ రామరాజు! 'నువ్వెక్కడన్నా చావు. నీ సెమినార్లూ లెక్చర్లూ నువ్ చూసుకో. నా పుట్టింట్లో నే ఛస్తా"నని వెళ్ళిపోతే నిజంగానే తానేం చేయగలిగాడు?! ఏ తూకపురాయితో తూచినా –భార్యాభర్తలు విడిపోయేందుకు సరిపోయే రాయా –ఆ సమస్య?! ఎన్నిసార్లు తాను వెళ్ళి బ్రతిమాలాడు? ఫలితం శూన్యంకదూ! తన అహం తననూ, ఆమె సంపన్నత ఆమెనూ ఏ సర్దుబాటుకూ అవకాశమీయకుండా అడ్డుకున్నాయి!

రామరాజు కుర్చీలోంచీ లేచి, యాంటీరూమ్ లోకి వెళ్ళి మొహం కడుక్కొచ్చాడు. ఫ్లాస్క్‌లోని కాఫీ కప్‌లో పోసుకుని తాగాడు. ఎంత వద్దనుకున్నా ఆలోచన సాగింది.

వర్తమానం మాత్రం ఏ శాంతినీ, సౌఖ్యాన్నీ యిస్తోంది? కొడుకూ – కోడలూ ఒక్కటే మాట– 'మీకేం తెలీదు మీరూరుకోండి'. అంతే! ఓ.కె. ఓ.కె. అనే తన సమాధానం. వారి కూతురు – తన మనవరాలు – అనూష– బిటెక్– ఐదో సెమ్! తల ఎప్పుడూ ఫేస్‌బుక్‌లో. చేతుల్లో ఛేజ్ నావెల్! 'ఎట్టాగమ్మా' అంటే 'ఏం చదవమంటావ్ తాతయ్యా– బోర్?' అని పారిపోతుంది. నాలుగు సబ్జెక్ట్స్ బకాయి. 'ఏమిటమ్మా?' అంటే 'సరిగ్గా చెప్పి చావరు తాతయ్యా. నీకు తెలియందేముంది! అందుకనే నేను కాలేజ్‌కి పోలేకపోతున్నాను' అంటుంది. మరి ఎక్కడికి వెళుతున్నావంటే 'ఫ్రెండ్స్‌ఉన్నారు కదా" అని కళ్ళు చికిలించి మొహం చాటు చేస్తుంది.

'మీ పాత్రని మీరు సరిగ్గా నిర్వర్తించ'మని హితబోధ చేశాడు సుబ్బు! ఏం చేస్తున్నాడు తాను?

–జీవితాన్ని సహజంగా జీవించలేకపోతున్నాననే బాధ తొలుస్తోంది రామరాజుని.

ఆ రాత్రి నిద్రపోయింది!

–మర్నాడు కాలేజీలో స్టాఫ్ మీటింగ్ పెట్టాడు. పాఠ్యాంశాల్లో మార్పుని గురించి చర్చ. సుబ్బు సలహా. ఏమీ తేలలేదు. కొద్దిసేపు 'సీ–సా'ఆట! మరో కొంతసేపు తాడుని లాగటం!

❖ ❖ ❖

వారం... పక్షం... నెల... సెమ్.. గడిచాయి. వేసిన గొంగళీ వేసిన చోటేవుంది. చర్చ – సా..గు...తూ..నే... వుంది!

-రామరాజుకు అస్వస్థత. శరీరంలో శక్తి అంతా ఆవిరియినట్లు నీరసం. కాళ్ళూ కళ్ళూ తేలిపోతున్నై. సర్వకాల సర్వావస్థల్లో ఏదో ఇదమిత్థంగా తెలీని అస్తిమితం, వ్యధ!

ఆరోజు–

సాయంత్రం ఆరు గంటలయింది. భారంగా వచ్చి ఇంట్లో పడ్డాడు. ఇంట్లో ఎవ్వరూ లేరు. మామూలే! సెల్ మోగింది. కొడుకు అవినాష్. "చెప్పు". "అనూష సూసైడ్ అటెంప్ట్ చేసుకుంది. పరిస్థితి కొంచెం సీరియస్‌గానే ఉంది. మీరు హాస్పటల్‌కి వచ్చేయండి" అని హాస్పటల్ పేరు చెప్పాడు.

తత్తఱలాడాడు రామరాజు.

'పిల్లల ఆత్మహత్యల్ని నివారించటానికి బుఱ్రల్ని ఉపయోగించండి రామరాజూ" సుబ్బు గొంతెత్తి అరుస్తున్నాడు కళ్లముందు.

హుటాహుటిని హాస్పటల్‌కి చేరాడు రామరాజు. నీరు నిండిన కళ్ళతో ఎదురైనారు కొడుకూ, కోడలూ. ఇద్దరూ కూతుర్ని గురించిన ఘోషని వెళ్ళబోసుకున్నారు. "ఫ్రెండ్‌లా ట్రీట్‌చేశాం. ఏనాడన్నా చదువు గురించి అడిగామా? మీరైనా దాని ప్రవర్తనను సరిచేశారా? ఈ సెమ్‌లో మళ్ళీ రెండు పేపర్లు పోయాయిట. బాయ్‌ఫ్రెండ్ హేళనచేసి, ఇంత మొద్దుతో నాకు కుదరదులే" అన్నాట్ట. ఇదీ కారణం. లెటర్ రాసి పెట్టింది" అని కళ్ళొత్తుకున్నారు.

'అనేక రకాలైన ఒత్తిదుల్ని తట్టుకునేందుకు మీరుగా ఇచ్చే మానసిక స్థైర్యం ఏమిటి?'– సుబ్బు ప్రశ్న. మనసంతా గచ్చపొదలా ఉంది. కుర్చీలో దిగబడ్డాడు.

చాలా సేపటికి – వార్డ్‌లోకి వెళ్ళి బెడ్‌మీది అనూషని చూశాడు. ఆమెకి ఆక్సిజన్ ఇస్తున్నారు. పక్కన రకరకాల మానిటర్లు. స్పృహలో లేదు. 'ఇరవైనాలుగ్గంటలు చూడాలి' అన్నాడు డాక్టర్.

రామరాజూ, కొడుకూ, కోడలూ – అపరాధ భావంతో శూన్యంలోకి కూరుకుపోయారు.

రోజు గడిచింది.

అనూష కోలుకుంది.

రామరాజు కళ్ళముందు ఇసుకచారలు కనిపిస్తున్నై. వాటిని సృష్టించి వెళ్ళిన కెరటం కనిపిస్తోంది. ఆ కెరటం వెనుక అఖాతమైన సముద్రపు హోరూ వినిపిస్తోంది.

ఇవ్వాళ....... వడివడిగా కాలేజీకి వెళ్లాడు రామరాజు. నివార్యమైన స్టూడెంట్ ఆత్మహత్య, అనూష ఆత్మహత్యా ప్రయత్నం ఆయన్ని నీడలా వెంబడిస్తున్నాయి. రోజంతా ఆలోచనలతోనూ, కొలీగ్స్‌తో చర్చలతోనూ సరిపోయింది. సాయంత్రానికి...... పాఠ్యప్రణాళికలో 'జీవనయానం-ఆత్మ విశ్వాసం' సబ్జెక్ట్‌ని చేరుస్తూ, విషయ సంగ్రహాన్ని పొందుపరుస్తూ ఉత్తర్వులు జారీచేసేశాడు.

* * * *

నాలుగేళ్లు గిర్రున తిరిగాయి.

ఇప్పుడు,

పాండవస్వామి ఇంజినీరింగ్ కాలేజీ ప్రత్యేకతల్లో మరీ ముఖ్యమైనది 'జీవనయానం-ఆత్మవిశ్వాసం' సబ్జెక్టే.

జీవితాన్ని గెల్చుకున్న విద్యార్థులు ఆ సంస్థకి నడుస్తున్న రాయబారులుగా వివిధ సంస్థల్లో ఉద్యోగులుగా రాణిస్తున్నారు!

**(రచన, ఏప్రిల్-మే, 2015)**